
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం । 29 । మే । 2025



సోమశిలలో 43.345 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారానికి 43.345 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 3,030, ఉత్తరకాలువకు 300, దక్షిణకాలువకు 50 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.99,180
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,978
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,247
నవర (8 గ్రాములు)	రూ.73,976

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.7 /29.3

జిల్లాలో గురువారం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపుల వాతావరణం ఉంటుంది. బుధవారం గాలిలో తేమ 57 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

సినిమా థియేటర్లలో తనిఖీలు



మాట్లాడుతున్న ఆర్డీఓ నాగ అనుష

కోవూరు/బుచ్చిరెడ్డిపాళెం రూరల్: కోవూరులోని రెండు థియేటర్లను నెల్లూరు ఆర్డీఓ నాగఅనుష, బుచ్చిరెడ్డిపాళెంలోని జమీలా, నాజ్ థియేటర్లను తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు బుధవారం తనిఖీ చేశారు. పార్కింగ్, టాయిలెట్లు పరిశీలించారు. పార్కింగ్‌కు అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు తప్పవని థియేటర్ నిర్వాహకులను హెచ్చరించారు. తినుబండారాల విక్రయించే స్టాల్ వద్ద ధరల పట్టిక లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరల పట్టిక కచ్చితంగా ఏర్పాటు చేయాలని సూచించారు. నాజ్ థియేటర్‌లో టాయిలెట్లు సరిగా లేవని, టికెట్ల ధరల విషయంలో అధికంగా వసూలు చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆర్డీఓ వెంట కోవూరు తహసీల్దార్ నిర్మలానంద బాబా, ఆర్ఐ, వీఆర్ఓ ఉన్నారు.

• ఆత్మకూరు: పట్టణంలోని సినిమాహాళ్లను ఆర్డీఓ బి పావని రెవెన్యూ సిబ్బందితో కలిసి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సినిమా హాళ్ల పరిసరాలను, పరిశుభ్రతను పరిశీలించారు. ప్రేక్షకులకు తాగునీరు వసతితో పాటు మరుగుదొడ్ల సౌకర్యం తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట డీటీ స్వరూప్, సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, లక్ష్మణ ఉన్నారు.

జామాయిల్ తోటల్లో పరిశీలన



తిరుమలాపురంలో జామాయిల్ నరికిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

ఉదయగిరి: మండలంలోని తిరుమాలపురం రెవెన్యూలో సర్వే నంబరు 139, 140, 145ల్లో అగ్రిగోల్డ్ భూముల్లో సాగులో ఉన్న జమాయిల్ తోటను బుధవారం సీఐడీ అధికారులు పరిశీలించారు. మంగళవారం జామాయిల్ కలపను నరికి అక్రమంగా తరలించే ప్రయత్నం చేయడం తెలిసిందే. ఈక్రమంలో సీఐడీ అధికారులు రెవెన్యూ అధికారులతో కలిసి భూములు గుర్తించి సర్వే చేశారు. సీఐడీ అధీనంలో ఉన్న భూముల్లో అక్రమంగా ప్రవేశించి చెట్లు నరికి తరలిస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కలప తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాలను సీజ్ చేయాల్సిందిగా సూచించారు. ఈ వ్యవహారం వెనుక కీలక వ్యక్తిగా ఉన్న నేలటూరుకు చెందిన ఇత్తడి శ్రీను పాత్రపై పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో సీఐడీ సీఐ రాజేష్‌కుమార్, ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

31న పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ ఈ నెల 31వ తేదీన చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి డీఎల్‌పీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ మండలాల ఎంపీడీఓలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక్క రోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

పదోన్నతులు, బదిలీల్లో గందరగోళం

• రాత్రి 8 తర్వాత రేపటికి వాయిదా


నెల్లూరు (టౌన్): ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారింది. ఎస్ఏలకు పదోన్నతుల ప్రక్రియ నగరంలోని దర్గామిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చేపట్టారు. ఈ జాబితా ప్రకారం జెడ్పీ 89, మున్సిపాలిటీ 4, ప్రభుత్వ స్కూల్స్‌ల్లో 8 మంది ఎస్ఏలకు పదోన్నతులు కల్పించనున్నారు. హెచ్ఎంలుగా నియమించేందుకు 1:3 నిష్పత్తిలో స్కూల్ అసిస్టెంట్లను పిలిచారు. అయితే హెడ్‌మాస్టర్లు పదోన్నతుల్లో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు రోస్టర్ జాబితాను రూపొందించలేదు. బదిలీల కోసం ఆప్షన్లు పెట్టుకున్న హెడ్‌మాస్టర్లకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ నుంచి ఆయా స్థానాల కేటాయింపు జాబితా రావాల్సి ఉంది. రోస్టర్ కం రిజర్వేషన్ పద్ధతిలో పదోన్నతులు కల్పించి, ఆయా స్థానాలు కేటాయించాల్సి ఉంది. రోస్టర్ కం రిజర్వేషన్ జాబితాను తయారు చేయకపోవడం, బదిలీల కోసం ఆప్షన్లు పెట్టుకున్న హెడ్‌మాస్టర్లకు స్థానాలు కేటాయించకపోవడంతో రాత్రి 8 గంటల తర్వాత ఈ ప్రక్రియను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రకటించారు.

నాడు



మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కృతం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమల్లో పైరవీలు, పక్షపాతం, అవినీతికి తావులేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ వాటిని అందజేయడమే లక్ష్యంగా 2019లో ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ పురుడు పోసుకుంది. ఐదేళ్ల పాటు అప్పటి ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం అమలు చేసినా గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా ఆయా పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను నిర్వహించింది. గత ప్రభుత్వం సచివాలయాల ద్వారా 534 రకాల పౌర సేవలను అందుబాటులోకి తెచ్చింది.

నేడు



చంద్రబాబు ప్రభుత్వం గ్రామీణ స్వరాజ్య పాలనకు తూట్లు పొడుస్తూ ఆ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. నాడు ఏ అవసరం వచ్చినా ఊరి గడప దాటకుండానే సేవలు పొందిన జనానికి ఇప్పుడు ఒక్క సేవ కూడా అందడం లేదు. ప్రతి అవసరానికి మండల కేంద్రానికి పరుగెత్తాల్సిన పరిస్థితులు ఉన్నాయి. రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, విలేజ్ లైబ్రరీలు, మిల్క్ చిల్లింగ్ సెంటర్లను నిరుపయోగం చేస్తూ వస్తోంది. కొన్ని భవనాలను ఏకంగా చెత్త, చెదారంతో నింపేస్తోంది. మరికొన్నింటిని గోడౌన్లగా మార్చేసింది. చివరి దశ నిర్మాణంలో ఉన్న భవనాలను వదిలేసింది. ఏడాదికి ముందు కళకళలాడిన భవనాలు.. నేడు బీడును తలపిస్తున్నాయి. దీంతో ఏడాది కాలంగా పల్లె కన్నీరు పెడుతోంది.

స్వరాజ్య పాలన విధ్వంసం

ఏడాదిగా పల్లె కన్నీరు

- నాడు ప్రతీ ఊరూ రాజధాని స్థాయిలో అభివృద్ధి
- నేడు సేవలు శూన్యం.. పథకాలు మాయం
- గోడౌన్లగా మారిన సచివాలయాలు, ఆర్బీకే భవనాలు
- అడపాదడపా తెరుచుకుంటున్న విలేజ్ క్లినిక్‌లు
- అసలే తెరుచుకోని వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు, డెయిరీ భవనాలు
- కొన్ని అలంకార ప్రాయం.. మరికొన్ని నిరుపయోగం



మూత పడిన రైతు సేవా కేంద్రం



తలుపులు తెరుచుకోని హెల్త్ క్లినిక్





సాక్షి ప్రతినిధి, నెల్లూరు : ఏడు దశాబ్దాల పైబడిన స్వతంత్ర భారతావనిలో మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం.. కలగానే మిగిలిపోయింది. ఆయన 150వ జయంతి ప్రత్యేకతగా 2019 అక్టోబరు 2న స్వరాజ్య పాలనకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారు. ప్రతి మారుమూల పల్లెను రాజధాని స్థాయిలో అభివృద్ధి చేసేందుకు బీజాలు వేయడమే కాకుండా.. అగమేఘాల మీద ఆవిష్కృతం చేశారు. గడిచిన ఐదేళ్లు ప్రగతికి ప్రతిరూపంగా విలసిల్లిన పల్లెలు, పట్టణాలు, నగరాలు.. ఇప్పుడు గొల్లుమంటున్నాయి.

ఊరు.. వార్డు దాటకుండానే..

ప్రజలు నిత్య జీవనంలో అవసరమైన సేవలు, సంక్షేమ ఫలాలు పొందేందుకు ఊరు, వార్డునే కాదు.. కనీసం ఇల్లు కూడా దాటకుండానే.. ఒక్క మాటలో చెప్పాలంటే.. కాళ్లు తడవకుండా సప్త సముద్రాలను దాటినట్లుగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయకుండానే ప్రతి గడపకు చేర్చారు. దాదాపు 14 వేల మంది వలంటీర్లను నియమించి 534 రకాల పౌర సేవలను అందుబాటులోకి తెచ్చారు.

కలయా నిజమా..

2019 వరకు గ్రామీణ ప్రజలు ఏ అవసరం వచ్చినా.. పట్టణాలు, డివిజన్, జిల్లా కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు ఉండేవి. ప్రభుత్వాల ఆదరణ లేక వ్యవసాయం, ఉపాధి పనులు లేక ఊర్లు విడిచి వలస వెళ్లిన పల్లె జనం తిరిగి సొంతూర్ల బాట పట్టారు. చదువుల కోసమో.. ఉపాధి కోసమో ఊర్లకు దూరంగా ఉంటున్న వారు తిరిగొచ్చాక మారిన తమ ఊరు రూపురేఖలు చూసి ఔరా.. ఇది కలయా.. నిజమా.. అంటూ కొన్ని క్షణాలు ఉద్విగ్న స్థితిలోకి వెళ్లారు. ప్రతి పంచాయతీ, వార్డు పరిధిలో 2 వేల మంది జనాభాకు ఒక సేవాలయాలుగా జిల్లా వ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, విలేజ్ లైబ్రరీలు, మిల్క్ చిల్లింగ్ సెంటర్ల నిర్మించారు.

ఠంచన్‌గా తలుపు తట్టిన పింఛన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి నెల 1వ తేదీ వేకువ జామునే తలుపు తట్టి పింఛన్ ఇచ్చి కొత్త చరిత్రను లిఖించారు. అంతకు ముందు వరకు టీడీపీ పాలనలో ప్రతి నెలా పింఛన్ అందుకోవాలంటే.. పది రోజులు పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. ఆ కష్టాలకు చెక్ పెడుతూ వలంటీర్ల వ్యవస్థను నిర్మించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ స్థాయిలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ప్రభుత్వంలో అర్హత సాధించే ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించేందుకు ప్రణాళికను రూపొందించారు. ప్రతి ఆర్నెళ్లకు ఒక్కసారి లబ్ధిదారుల ఎంపిక చేపట్టి ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దిగిపోయే నాటికి 3,14,422 సామాజిక పింఛన్లు ఉంటే.. ఇప్పుడు కూటమి పాలనలో 3,05,804 మందికే ఇస్తున్నారు. కొంత పింఛన్ల ఎంపికను గాలికి వదిలేశారు.

అప్పుడు 534 సేవలు

గతంలో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వలంటీర్లతోపాటు 11 రకాల కేడర్ ఉద్యోగుల ద్వారా 534 సేవలను అందించారు. దాదాపు 36 పథకాలను అందించారు. ఇప్పుడు కూటమి పాలనలో సేవలు, సంక్షేమ ఫలాలు నిర్వీర్యమయ్యాయి. ఏడాది కాలం పూర్తవుతున్నా సంక్షేమ పథకాల అమలు చేయడం లేదు. ఎన్నికల సమయంలో సంపద సృష్టించి సంక్షేమ ఫలాలు అందిస్తానని చంద్రబాబు అబద్ధాలు చెప్పాడు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా పావులు కదుపుతుంది.

ఇంటి వద్దకే వైద్యం.. ఇప్పుడు?

దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా వైద్య ఆరోగ్య రంగానికి సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. రూ.వేల కోట్లు వ్యయం చేశారు. పల్లె ముంగిటకే వైద్యులు వచ్చేలా ఇంటికి వెళ్లే వైద్య సేవలు అందించే బృహత్తర కార్యక్రమం ప్రవేశపెట్టారు. ఇందుకోసం ప్రతి 2,550 జనాభాకు ఒక డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసింది. బీఎస్సీ నర్సింగ్ కోర్సు అర్హత కలిగిన మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంహెచ్‌పీ)లను నియమించారు. జిల్లాలో మొత్తం 61 ప్రాథమిక ఆరోగ్య కేంద్రా (పీహెచ్‌సీ)లకు అనుబంధంగా 497 డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించారు. అందులో 12 రకాల వైద్య సేవలు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 67 రకాల బేసిక్ ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులో ఉంచారు. విలేజ్ క్లినిక్‌లన్నింటిలో ఏఎన్ఎంలతోపాటు హెల్త్ అసిస్టెంట్‌తో పాటు ఆశా కార్యకర్తలు 24 గంటలు అందుబాటులో ఉంటున్నారు. విలేజ్ క్లినిక్‌లను పీహెచ్‌సీలు, ల్యాబ్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేశారు. దీంతో టెలీమెడిసిన్ వైద్య సదుపాయం కల్పించారు.

సచివాలయం ఎత్తేశారు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం సచివాలయాలకు విలువ లేకుండా చేశారు. ఐదేళ్ల పాటు ప్రజలకు వందల రకాల సేవలు అందించే సచివాలయాల వ్యవస్థను ఈ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కొన్ని మండలాల్లో సచివాలయాలను ఒకదానితో మరో గ్రామంలోని సచివాలయాన్ని కలిపేశారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని అనంతసాగరం మండలం కొత్తపల్లిలో గత ప్రభుత్వ కాలంలో అద్దె భవనంలో నిర్వహిస్తున్న సచివాలయాన్ని కూటమి ప్రభుత్వం అద్దె భవనం నుంచి సచివాలయాన్ని ఎత్తేశారు. రైతు సేవా కేంద్రంలో ఓ మూలగా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సచివాలయం పరిధిలో కొత్తపల్లి, కచ్చేరిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి, వడ్డిపాళెం, కాకూరువారిపల్లి గ్రామాలు ఉన్నాయి. అయితే సచివాలయాన్ని పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్ ఇద్దరూ ఇన్‌చార్జిలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సచివాలయంలోని కంప్యూటర్లు, ప్రింటర్ పూర్తిగా మరమ్మతులకు గురై మూలనపడ్డాయి. ఈ సచివాలయం పరిధిలోని ఐదు గ్రామాల ప్రజలకు సమస్యలు పరిష్కారం కావాలంటే దేవరాయపల్లి బిట్1 సచివాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.



ఆత్మకూరు: కొత్తపల్లిలో సచివాలయ భవన నిర్మాణ పనులు నిలిపివేసిన దృశ్యం



వింజమూరులో సిమెంటు గోదాముగా మారిన డిజిటల్ లైబ్రరీ

ఉదయగిరి: ఈ చిత్రంలో కనిపిస్తున్న డిజిటల్ లైబ్రరీ వింజమూరు తహసీల్దార్ కార్యాలయం అవరణలో గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రూ.17.50 లక్షలు ఖర్చు చేసి పూర్తి చేశారు. ఇంతలోనే సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక అధికార పార్టీ నేతలు చేసే పనులకు సిమెంట్ గోదాముగా మర్చారు. ఇందులో ప్రస్తుతం సిమెంటు బస్తాలు నిల్వ చేసి ఉన్నారు.

దివ్యాంగుడి కష్టం..

నెల్లూరు ఏసీనగర్‌కు చెందిన బాలాజీ దివ్యాంగుడు. మరొకరి సహాయం లేకపోతే బయటకు వెళ్లలేడు. అటువంటి బాలాజీకి వైఎస్సార్‌సీపీ పాలనలో అవసరమైన సేవలన్నీ సచివాలయం, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దనే అందాయి. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి బాలాజీ తన పనులు చక్కబెట్టుకునేందుకు నానా అవస్థలు పడుతున్నాడు. తండ్రి మరణించాడు. తల్లి అనారోగ్యంతో మంచి మీద ఉంది. ఏ పనిచేసుకోలేని ఆయన ప్రస్తుతం ప్రభుత్వ సేవల కోసం ఇతరుల తోడు అవసరం కావడంతో, ఆసరాగా వచ్చేందుకు ఎవరూ రాక కుమిలిపోతున్నాడు.

నాడు సేద్యానికి భరోసా.. నేడు తిరోగమనం



వింజమూరులో నిరూపయోగంగా ఉన్న కియోస్క్

వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల భవితకు భరోసా కల్పిస్తూ ఆర్బీకేలు నిర్మించారు. ప్రస్తుతం రైతులకు సేవలు అందడం లేదు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, సాగు సలహాలు ఇచ్చే అధికారులు అందుబాటులో లేక రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండడం లేదు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పుట్టి ధాన్యం రూ.28 వేల నుంచి రూ.29 వేలకు రైతులు విక్రయించారు. ప్రస్తుతం రూ.14 వేల నుంచి రూ.15 వేలకు ధాన్యం ధరలు పతనమయ్యాయి. నాడు భరోసా కల్పించిన సేవాలయాలు.. నేడు తిరోగమనం వైపు ప్రయనిస్తున్నాయి.

స్నేహపూర్వక సంబంధాలు ఉండేవి



గతంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తుల మధ్య స్నేహ పూర్వక సంబంధాలు ఉండేవి. వలంటీర్లు కీలకపాత్ర పోషించేవారు. తరచూ ప్రతి ఇంటిని సందర్శించేవారు. ప్రజలు కూడా పలు సేవలు గ్రామ స్థాయిలో సచివాలయాల్లోనే ఉండడంతో సచివాలయానికి వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో పనిచేసిన ఉద్యోగులు గ్రామాల్లో అందరితో సొంత మనుషుల వలే కలిసిపోయేవారు. ప్రస్తుతం ప్రజలు సచివాలయాలకు వెళ్లే పరిస్థితులు కూడా కనిపించడం లేదు.

– మార్లేళ్ల తిరుపాలురెడ్డి, చంద్రారెడ్డిపాళెం, కలిగిరి మండలం

రైతులకు అందని సేవలు



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రానికి వెళ్లి కియోస్క్ మిషన్ ద్వారా కావాల్సిన ఎరువులకు దరఖాస్తు చేసుకునే వాళ్లం. వ్యవసాయ యంత్రాలు కావాలన్నా తెచ్చుకునే వాళ్లం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో రైతు సేవా కేంద్రాలకు ఎరువులు రావడం లేదు. మండల కేంద్రాలకు, పట్టణాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేసుకుని రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– ఇంటూరి మాధవరావు, రైతు, కొండముడుసుపాళెం

ఒకరిద్దరే హాజరు



బిట్–1 సచివాలయానికి ఉదయం 11.30 గంటల సమయానికి కూడా ఉద్యోగులు విధులకు హాజరు కావడం లేదు. ఒక్క డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే విధులకు హాజరయ్యారు. గతంలో సచివాలయాలు ప్రజల తాకిడితో సందడిగా ఉండేవి. ఇప్పుడు ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం అయింది.

– చల్లా నవకోటి, మనుబోలు

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు

- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్





మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసేందుకు జైలు వద్దకు వచ్చిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, నాయకులు (ఇన్‌సెట్లో) మాజీ మంత్రి అనిల్‌కుమార్

వెంకటాచలం/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. అక్రమ కేసులతో జిల్లా జైల్లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని బుధవారం వీరు వేర్వేరుగా ములాఖత్ ద్వారా కలిశారు. అనంతరం జైలు వద్ద వీరు విలేకరులతో మాట్లాడారు. రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం జైల్లో పెట్టించిందని విమర్శించారు. ఇలాంటి ఎన్ని కుట్రలు చేసినా భయపడబోమని, రెట్టింపు ఉత్సాహంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు జిల్లాలో పని చేస్తాయన్నారు. ఈ కేసుల్లో కాకాణికి ఎలాంటి సంబంధం లేదని, కక్ష పూరితంగానే ఇరికించారన్నారు. మైన్స్ కేసుకు సంబంధించి గత ప్రభుత్వంలోనే విచారణ జరిగి ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదని అధికారులు రిపోర్టులు ఇచ్చినప్పటికీ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలతో కేసు నమోదు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ప్రశ్నిస్తున్న గొంతును నొక్కాలనే ప్రభుత్వం ఈ అక్రమ కేసు బనాయించిందన్నారు. ఈ కేసులో కాకాణి క్లీన్‌చిట్‌తో బయటకు వస్తారని తెలిపారు. రాష్ట్రంలో అభివృద్ధిని విస్మరించి, వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులను కేసుల్లో ఇరికించి, జైలు పాలు చేయాలనే కుట్రలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినా కాకాణి ధైర్యం కోల్పోలేదని చెప్పారు. జిల్లాలో ప్రజల పక్షాన చేసే పోరాటాలపై తమతో చర్చించారని చెప్పారు. జూన్ 4వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేలా చూడాలని తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటరు ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, 4, 16 డివిజన్ ఇన్‌చార్జిలు సంధాని, నగిలి జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సింగంశెట్టి అశోక్, అస్లాం, కొండయ్య, శేఖర్, పెంచలయ్య, వెంకటేష్, ప్రసన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



కాకాణి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్ రెడ్డి

అండగా ఉన్నాం.. భయపడొద్దు

- మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి
- కాకాణి కుటుంబ సభ్యులకు పరామర్శ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతిపక్ష నాయకులను ఇబ్బందులు పెట్టే విధంగా పాలన సాగిస్తున్నారని, వైఎస్సార్‌సీపీలో అందరం ఐక్యంగా ఉండి కూటమి దుష్ట రాజకీయాలను అడ్డుకుంటామని, ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి నెల్లూరు డైకస్‌రోడ్డులోని మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు. కూటమి హామీలు అమలు చేయాలని ప్రశ్నించిన నాయకులపై అక్రమ కేసులు పెడుతూ రెడ్‌బుక్ పాలన సాగిస్తున్నారన్నారు. అక్రమ కేసులో కాకాణిని అరెస్ట్ చేయడం జరిగిందని, ప్రజల పక్షాన నిలిచే అలాంటి వ్యక్తి ఇలాంటి కేసులకు భయపడరని, తామంతా ఉన్నామన్నారు. కాకాణికి కోర్టులో తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. ఆయనపై పెట్టిన అక్రమ కేసుల నుంచి తప్పకుండా బయటకు వస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులకు ఇబ్బందులకు గురి చేస్తున్న కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

క్లుప్తంగా

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్

- నిందితుల్లో నెల్లూరు జిల్లా వాసులు
- 476 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల్లో వరుస చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముఠాను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం అదుపులోకి తీసుకుంది. వారి నుంచి రూ.30 లక్షల విలువైన 476 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు మోటార్‌బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నగరంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు వెల్లడించారు. సీసీఎస్ సీఐ రామ్‌కుమార్ ఇబ్రహీంపట్నం తుమ్మలపాళెం బస్టాప్ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న అనుమానాస్పదంగా పారిపోతున్న ఆచ్చి గిరిబాబు, ఆచ్చి మహేశ్ (నెల్లూరు జిల్లా ఉప్పుటూరు), గాలేటి వెంకటరమణమ్మ, మొగిలి సంధ్య (ఎన్టీఆర్ జిల్లా)ను అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రధాన నిందితుడు గిరిబాబు తన స్వగ్రామంలో వ్యవసాయ కూలీ. జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. తన నివాస పరిసరాల్లో గతంలో 12 చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి జైలు జీవితం అనుభవించాడు. జైలు నుంచి విడుదలైన తర్వాత రెండో భార్య వెంకటరమణమ్మ ఉండే ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి మకాం మార్చాడు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలో తన బైక్‌పై తిరుగుతూ తమ్ముడు మహేష్‌తో కలిసి నాలుగు, భార్య వెంకటరమణమ్మతో కలిసి మూడు, మరదలు సంధ్యతో కలిసి మూడు, అతనొక్కడే 15 చైన్ స్నాచింగ్‌లు చేశాడు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో రెండు, జగ్గయ్యపేట సర్కిల్లో మూడు, మైలవరం సర్కిల్‌లో నాలుగు, తిరువూరు సర్కిల్లో మూడు, కృష్ణా జిల్లాలో నాలుగు, ఏలూరు జిల్లాలో రెండు, తెలంగాణ రాష్ట్రంలో ఏడు చైన్ స్నాచింగ్ నేరాలకు పాల్పడ్డాడని సీపీ వెల్లడించారు. సమావేశంలో క్రైమ్ డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి, ఏడీసీపీ ఎం.రాజారావు, ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

కండలేరు అతిథి గృహంలో షార్ట్ సర్క్యూట్



రాపూరు: కండలేరు అతిథి గృహంలోని స్టోర్ రూమ్‌లో బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో వివిధ వస్తువులు కాలిపోయాయి. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో సిబ్బంది అప్రమత్తమై మంటల్ని ఆర్పే ప్రయత్నం చేశారు. అలాగే అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించగా వారొచ్చి మంటల్ని అదుపు చేశారు. ఎంత నష్టం వాటిల్లిందో అంచనా వేయాల్సి ఉందని కండలేరు డీఈ రేవతి తెలిపారు.

ఏమైపోతే మాకేం..!



డ్రమ్ముల్లో చికెన్ వ్యర్థాలు (ఫైల్)



గుంతలో వ్యర్థాల పూడ్చివేత

ప్రజల ఆరోగ్యంతో కూటమి నేతలు చెలగాటమాడుతున్నారు. వారి అండదండలతో చికెన్ వ్యర్థాల రవాణా జరుగుతూనే ఉంది. సంగం మండలంలో నిత్యం పదుల సంఖ్యలో డ్రమ్ములను పట్టుకుంటూనే ఉన్నారు. పోలీసులు, మత్స్యశాఖ అధికారులు వ్యర్థాలను పూడ్చివేస్తున్నా రవాణా ఆగడం లేదు.

ప్రజల ఆరోగ్యంపై కూటమి దెబ్బ

- ఆగని చికెన్ వ్యర్థాల రవాణా
- రోజూ ఏదోఒక చోట దొరుకుతున్న వైనం
- వాటాల విషయంలో నేతల మధ్య ఆధిపత్యపోరు

సంగం: మండలంలోని పలు ప్రధాన పంచాయతీల్లో వేల ఎకరాల్లో చేపల గుంతలున్నాయి. చేపలకు ఆహారంగా వేసేందుకు కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి చికెన్ వ్యర్థాలను పెద్ద ఎత్తున వాహనాల్లో సంగం తీసుకొస్తున్నారు. ఇలా చేయడం తప్పని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. వ్యర్థాలు తిని పెరిగిన చేపల వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. అయినా కాసుల కోసం కూటమి నేతల అండతో ఈ తంతును కొనసాగిస్తున్నారని విమర్శలున్నాయి. కొద్దిరోజుల నుంచి మండల కేంద్రమైన సంగంతో పాటు సమీప గ్రామాల్లో చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న వాహనాలను పోలీసులు, మత్స్యశాఖ అధికారులు పట్టుకుని కొండ ప్రాంతంలో గుంత తీసి పూడ్చేస్తున్నారు.

కొద్దిరోజులుగా..

ఈనెల 15న సంగం కొండమలుపులో 30 డ్రమ్ముల్లో వ్యర్థాలను తరలిస్తుండగా పట్టుకున్నారు. 16న మరో వాహనం పట్టుబడింది. 19న నాలుగు వాహనాల్లో తరలిస్తున్న 45 డ్రమ్ములు, 20న 30 డ్రమ్ములు, 24న 12 డ్రమ్ములు, 25న 80 డ్రమ్ములు, బుధవారం 8 డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు.

వారి వల్లే..

చికెన్ వ్యర్థాల తరలింపునకు సంబంధించిన పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయి. రవాణాకు అండగా నిలిచినందుకు అధికార పార్టీ నేతలు వ్యర్థాలను విక్రయిస్తున్న వారి నుంచి నగదు వసూలు చేస్తున్నారు. కాగా వాటాల కోసం నాయకుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. వర్గాలుగా విడిపోయి వాహనాలు వస్తున్న సమాచారాన్ని అధికారులకు ఇచ్చి పట్టిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం పోలీస్‌స్టేషన్ ప్రాంగణం చికెన్ వ్యర్థాల తరలింపు వాహనాలతో నిండిపోయింది.

11 మందిపై కేసులు నమోదు

సంగం మండలంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నాం. నిబంధనలు అతిక్రమించి కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి చేపల గుంతల నిర్వాహకులు, మధ్యవర్తులు, నేతలు ఎవరైనా తరలించినట్లయితే చర్యలు తప్పవు. రోజూ రాత్రి సమయాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే 11 వాహనాలను పట్టుకుని 11 మందిపై కేసులు నమోదు చేశాం. – రాజేష్, ఎస్సై, సంగం

అల్లూరులో దొంగల బీభత్సం



బీరువాలోని దుస్తులను చెల్లాచెదురుగా పడేసిన దొంగలు

అల్లూరు: అల్లూరు నగర పంచాయతీలో ఐదు రోజుల్లో మూడు దొంగతనాలు జరిగాయి. దీంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. అల్లూరు నలగట్లవారివీధిలో ఓ కుటుంబం పెళ్లికి వెళ్లగా శనివారం వారింట్లో బంగారు వస్తువుల, వెండి పట్టీలు అపహరించారు. శివాలయం వీధిలో ఉన్న దత్తసాయి మందిరంలో మంగళవారం రాత్రి దొంగలు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. మందిరం తలుపులను పగులగొట్టి లోపలికెళ్లారు. అక్కడేమీ లభ్యం కాకపోవడంతో వెనుదిరిగారు. పెయ్యలవారివీధిలో ఉంటున్న షేక్ రఫీ కుటుంబం మూడురోజుల క్రితం దైవదర్శనం నిమిత్తం నాగూరు నాగపట్నం వెళ్లి బుధవారం ఉదయం ఇంటికొచ్చింది. తలుపులు పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి ఉండటాన్ని రఫీ గుర్తించారు. 5 సవర్ల బంగారం, వెండి వస్తువులు, రూ.80 వేల నగదును దొంగలు చోరీ చేసినట్లు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కండలేరులో 41.177 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 41.177 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 1,890, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

• వింజమూరు (ఉదయగిరి): వింజమూరుని బీసీ కాలనీకి చెందిన బాలిక అదృశ్యంపై తల్లి దొరసానమ్మ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రెండు రోజుల క్రితం బాలిక ఇంటి నుంచి అదృశ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటనారాయణ తెలిపారు.

రైల్లో గంజాయి తరలిస్తుండగా..

- 7.7 కేజీలు పట్టుకున్న రైల్వే పోలీసులు
- ముగ్గురు వ్యక్తుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సుధాకర్

నెల్లూరు(క్రైమ్): టాటానగర్ – ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అక్రమంగా తరలిస్తున్న 7.7 కేజీల గంజాయిని నెల్లూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. బుధవారం రైల్వే సీఐ ఎ.సుధాకర్ నెల్లూరులోని కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. రైళ్లలో మత్తు, మాదకద్రవ్యాల అక్రమరవాణా కట్టడికి రైల్వే పోలీసులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా కావలి, నెల్లూరు, గూడూరు రైల్వే పోలీసులు బృందాలుగా ఏర్పడి ఒడిశా నుంచి చెన్నై, కర్ణాటక వెళ్లే రైళ్లలో తనిఖీలు చేపట్టారు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో సీఐ, ఎస్సై హరిచందనలు టాటానగర్ – ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైల్లోని జనరల్ బోగీలో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా మదుకూరు ప్రాంతానికి చెందిన ఎస్.మొహమ్మద్ సమీర్, గుణశేఖర దిపక్, కర్ణాటక రాష్ట్రం చిక్‌మగళూరు జిల్లా చిక్కాంగల ప్రాంతానికి చెందిన ఎస్.హర్షవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని వారి బ్యాగ్‌ల్లో 7.7 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. ఒడిశా, ఏపీ సరిహద్దు జిల్లాల్లో గంజాయిని తక్కువ ధరలకు కొనుగోలు చేసి తమిళనాడు రాష్ట్రం జోలార్‌పేట పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు వెల్లడైంది. దీంతో నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులందరూ 27 ఏళ్లలోపు వయసున్న వారే. దాడుల్లో పాల్గొన్న నెల్లూరు, గూడూరు రైల్వే ఎస్సైలు ఎన్.హరిచందన, వై.చెన్నకేశవ, సిబ్బంది వెంకటేశ్వర్లు, మణికంఠ తదితరులను రైల్వే డీఎస్పీ జి. మురళీధర్ అభినందించారు.

కల్వర్టును ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు



కారును పరిశీలిస్తున్న పోలీస్

సిద్దవటం: మండలంలోని సాబ్‌బావి రహదారి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉదయగిరికి చెందిన ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉదయగిరికి చెందిన వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాడాల వెంకట శ్యామ్‌ప్రసాద్ తన కారులో రాష్ట్ర నాయకుడు పట్టెడ రమణను ఎక్కించుకుని కడప ప్రెస్‌క్లబ్‌లో సమావేశానికి బయలుదేరారు. సాబ్‌బావి రహదారి సమీపంలోకి రాగానే కారు కల్వర్టును ఢీకొని మూడు పల్టీలు కొట్టింది. వారిద్దరూ తీవ్రంగా గాయపడగా అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌లో కడప రిమ్స్‌కు తరలించారు. సమాచారం తెలుసుకున్న సిద్దవటం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

అనుమానం పెనుభూతమై..

- గడ్డి మందు తాగిన వ్యక్తి
- చికిత్స పొందుతూ మృతి

సైదాపురం: ఓ వ్యక్తి సొంత వదినతో సహజీవనం చేస్తూ ఆమెపై అనుమానం పెంచుకుని గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన సైదాపురం మండలంలోని కట్టుబడిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికుమార్ కథనం మేరకు.. కట్టుబడిపల్లి గ్రామానికి చెందిన గిలక రవి (38) కూలీ పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. వదినతో ఐదేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. ఆమె ప్రవర్తనపై అనుమానం పెంచుకుని ఈనెల 9వ తేదీన ఇంట్లోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి రవి మృతిచెందాడని సైదాపురం పోలీసులకు వైద్యులు సమాచారమిచ్చారు. దీంతో బుధవారం వారు ఆస్పత్రికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

విస్తృతంగా యోగాంధ్ర కార్యక్రమాలు



యోగా చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీ

- నెల్లూరులో సామూహికంగా యోగా సాధన
- పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్, ఎస్పీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని ఉన్నతాధికారులు పిలుపునిచ్చారు. నెల్లూరులోని ఇరుకళలమ్మ దేవాలయం వద్ద బుధవారం సామూహిక యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, వివిధ శాఖల అధికారులు, వెయ్యి మందికి పైగా ప్రజలతో కలిసి సామూహికంగా యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ భారతదేశం అందించిన యోగా విద్య నేడు ప్రపంచానికి మార్గదర్శకమైందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ యోగా ప్రాధాన్యత తెలిపి వారి దినచర్యలో భాగం చేయడం యోగాంధ్ర ప్రధాన లక్ష్యమన్నారు. యోగా సాధన చేస్తే ఉద్యోగాల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తారన్నారు. జూన్ 21న జిల్లాలో సుమారు 10 లక్షల మంది యోగాసనాలు ఆచరించేలా కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 300 మంది మాస్టర్ ట్రెయినర్లకు శిక్షణ పూర్తి చేశామన్నారు. గ్రామ, వార్డు స్థాయిలో సుమారు 7 వేల మంది శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. వీరందరూ గ్రామ, వార్డుస్థాయిలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. అనంతరం యోగా గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణప్రసాద్, ఆయూష్ ఆర్జేడీ డాక్టర్ పద్మజాతి, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లా టూరిజం అధికారి ఉషశ్రీ, జిల్లా యోగాసమితి అధ్యక్షుడు విజయకుమార్, కార్యదర్శి పెంచలయ్య, యోగా శిక్షకులు కావ్యశ్రీ, రవీంద్ర, వెంకటసుబ్బయ్య, శ్రీను, దివ్యసాదన్ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఎత్తు, బరువు నమోదు చేయాలి

నెల్లూరు రూరల్: పిల్లలల కచ్చితమైన ఎత్తు, బరువు నమోదు చేయాలని, తక్కువ ఉండే వారికి సరైన పోషణ, వైద్యసేవలు అందించడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. ఐసీడీఎస్ కార్యక్రమాలపై సీడీపీఓ, సూపర్‌వైజర్లతో ఆయన బుధవారం నెల్లూరులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ సమయంలో పిల్లల శారీరక వృద్ధి పర్యవేక్షణ చేయాలన్నారు. తప్పుడు డేటా నమోదు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఇందుకు గానూ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వ్యక్తిగత బాధ్యత తీసుకుని పనిచేయాలన్నారు. వృద్ధి రేటు తక్కువగా ఉన్న పిల్లల తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడాలన్నారు. సరైన పోషకాహారం, వైద్యసేవలందించి సాధారణ స్థితికి వచ్చేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్ల బదిలీల్లో గందరగోళం

- 30కి కౌన్సెలింగ్ వాయిదా

నెల్లూరు (అర్బన్): జిల్లాలో వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ల బదిలీ ప్రక్రియ గందరగోళంగా మారింది. ప్రస్తుతం 302 మంజూరు పోస్టులకు 115 మంది రెగ్యులర్ కింద, 119 మంది కాంట్రాక్ట్ కింద హెల్త్ అసిస్టెంట్లుగా పని చేస్తున్నారు. వీరి బదిలీలకు సంబంధించి మంగళవారం జిల్లా వైద్యశాఖ అధికారి కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో కాంట్రాక్ట్ కింద పనిచేసే హెల్త్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను ముందుకు తెచ్చారు. రెగ్యులర్‌గా పనిచేస్తున్న వారి జాబితాను వెనుక చేర్చారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రకారం ఈ జాబితాను సిద్ధం చేశారు. హెల్త్ అసిస్టెంట్లను మలేరియా విభాగపు పనుల్లో వినియోగించుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సోమవారం హడావుడిగా కౌన్సెలింగ్ జాబితాను తయారు చేశారు. దీంతో రెగ్యులర్ హెల్త్ అసిస్టెంట్లు తమకు ముందుగా ప్రాధాన్యమివ్వాలని, తర్వాతనే కాంట్రాక్ట్ వారికి అవకాశం కల్పించాలని పట్టుపట్టారు. ప్రస్తుత జిల్లాను యూనిట్‌గా తీసుకుని బదిలీలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లు మాట్లాడుతూ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలున్న వారికి, స్పౌజ్ కింద ప్రాధాన్యమివ్వాలని కోరారు. డీఎంహెచ్‌ఓ సుజాత మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ కాంట్రాక్ట్, రెగ్యులర్ వారిని సమానంగా చూడాలని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. మిగతా జిల్లాల్లో ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రక్రియ పాత జిల్లాల పరిధిలోనే పూర్తయిందని వివరించారు. ఇందుకు హెల్త్ అసిస్టెంట్లు అంగీకరించలేదు. ఏళ్ల తరబడి అల్లీపురం, మహ్మదాపురం, కలువాయి పీహెచ్‌సీల్లో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లను ఎందుకు బదిలీ జాబితాలో చూపలేదని ప్రశ్నిస్తున్నారు. కొన్ని సచివాలయాల పరిధిలో ఎక్కువ మంది హెల్త్ అసిస్టెంట్లు అవసరమున్నా అక్కడ తగినంత మందిని నియమించకపోవడం చూస్తే సంబంధిత సెక్షన్లలో వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. అందువల్ల కౌన్సెలింగ్‌ను తక్షణమే వాయిదా వేయాలని హెల్త్ అసిస్టెంట్లు డిమాండ్ చేయడంతో డీఎంహెచ్‌ఓ సుజాత కౌన్సెలింగ్‌ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని, తిరిగి ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తానని తెలిపారు.

'పది' మూల్యాంకనంలో విద్యార్థికి అన్యాయం

- ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

నెల్లూరు(టౌన్): ఇద్దరు టీచర్లను సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.బాలాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మూల్యాంకనంలో జి.మోక్షిత అనే విద్యార్థికి సోషల్ సబ్జెక్ట్‌లో 21 మార్కులు వేశారు. సదరు విద్యార్థి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేయగా 84 మార్కులు వచ్చాయి. దీంతో మూల్యాంకనంలో అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా బాధ్యతలు నిర్వహించిన మనుబోలు జిల్లా పరిషత్ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ ఎ.శాంతి, స్పెషల్ అసిస్టెంట్‌గా వ్యవహరించిన కోవూరు మండలం కొత్తూరు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్ వి.సురేష్‌ను సస్పెండ్ చేసినట్లు తెలియజేశారు.